క్లుప్తంగా

డ్రగ్స్ ఫ్రీ ఇండియాపై అవగాహన



జంపని(వేమూరు): డ్రగ్స్ వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అందువల్ల డ్రగ్స్‌ను నిషేధించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్రినారాయణ అన్నారు. వేమూరు మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ ఫ్రీ ఇండియాపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి మాట్లాడుతూ డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం అని చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం డ్రగ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. తర్వాత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.మేరీ కుమారి, పి.బసవమ్మ, బి.జయప్రద, టి.లక్ష్మీ తిరుపతమ్మ, టి.విజయదుర్గ, కె.సువర్ణ, ఎం.కోటి లింగమ్మ, అంగన్‌వాడీ పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన



వేమూరు: మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రమాదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా జ్వరాలు వ్యాపించకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి మలేరియా నివారణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పున్నారావు, వంగల పున్నా రెడ్డి, కంఠ ఉమాకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు అనివార్యం

- రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పట్టణంలో పెరిగిన వాహనాల రద్దీ
- లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లకు బాపట్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు
- వాహన చోదకులకు సమయం, డబ్బు వృధా



రేపల్లె పట్టణ ఏరియల్ వ్యూ

రేపల్లె: రేపల్లె పట్టణం రోజు రోజుకు వేగంగా అభివద్ధి చెందుతున్నా, ఇక్కడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం లేకపోవటంతో ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల పెరుగుదలతోపాటు వాటి నిర్వహణ, తనిఖీల కోసం అవసరమయ్యే సేవలు సమీపంలో అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు నిత్యం బాపట్లకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తొమ్మిది మండలాలను కలుపుకుని రేపల్లెను రెవెన్యూ డివిజనల్ కార్యాలయంగా ఏర్పాటు చేసి దాదాపు రెండున్నర సంవత్సరాల కాలం గడుస్తున్నా డివిజన్ ప్రధాన కేంద్రమైన రేపల్లె పట్టణంలో ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ కార్యాలయాలు పూర్తిస్థాయిలో ఏర్పడక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రేపల్లెను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాలను రేపల్లెకు తీసుకువచ్చారు. మరిన్ని కార్యాలయాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఎన్నికలు రావడంతో కార్యాలయాలు ఏర్పాటు కాలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి సంవత్సరం గడిచినా ఈ అంశంపై దృష్టి సారించకపోవటంతో పలు కార్యాలయాలు రేపల్లెలో ఏర్పడక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం లేకపోవటంతో వాహన చోదకులు ప్రతి చిన్న సేవకై బాపట్ల, గుంటూరు వెళ్లాల్సి వస్తోంది.

9 మండలాలు.. 6 లక్షల ప్రజలు

కొత్త వాహనాల రిజిస్ట్రేషన్, ఓనర్‌షిప్ మార్పులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు వంటి అవసరాల కోసం వందలాది మంది ప్రజలు 55 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో సమయం, డబ్బు వృధా అవుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇది తలకు మించిన భారంగా మారుతోంది. రేపల్లె డివిజన్ కేంద్రంపై 9 మండలాల్లోని దాదాపు 6 లక్షల మంది ప్రజలు ఆధారపడి ఉన్నారు.

అధిక మొత్తంలో వసూలు

ప్రతి నెల వందల సంఖ్యలో యువత డ్రైవింగ్ లైసెన్స్‌లకు దరఖాస్తు చేస్తుండగా, స్థానికంగా కార్యాలయం లేకపోవడంతో బాపట్లకు వెళ్లాల్సి వస్తోంది. పరీక్ష కేంద్రం అందుబాటులో ఉంటే వారికి సౌలభ్యం కలుగుతుంది. అయితే మధ్యవర్తులు.. బాపట్ల వెళ్లకుండా.. లైసెన్స్‌లు ఇప్పిస్తామంటూ వాహన చోదకుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు పలువురు బహిరంగంగానే అంటున్నారు. వాహనాన్ని బట్టి ధరను నిర్ణయిస్తున్నారు. ద్విచక్ర వాహనంకు సుమారు రూ.4,500 నుంచి రూ.5 వేల వరకు, ఇక నాలుగు చక్రాల వాహనాలకు రూ.5 వేలపైమాటగా డబ్బులు వసూలు చేస్తున్నారని వినికిడి. సాధారణంగా ద్విచక్ర వాహనంకు లైసెన్స్ పొందేందుకు చలానా రూపంలో రూ.1,270, నాలుగు చక్రాల వాహనంకు రూ.1680 చెల్లిస్తే సరిపోతుంది. కొందరు వాహన చోదకులు బాపట్ల వెళ్లే సమయం లేకపోవటంతో మధ్యవర్తులను ఆశ్రయించి అధిక మొత్తంలో డబ్బును చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్నారు.



పట్టణంలోని పార్కింగ్‌లో ఉన్న వాహనాలు

ఆర్టీవో కార్యాలయంతో ప్రయోజనాలు ఇవి...

- డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం
- వాణిజ్య వాహనాల తనిఖీల ద్వారా భద్రత
- స్థానిక ఉపాధికి అవకాశాలు
- పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు
- రేపల్లె నుంచి బాపట్లకు వెళ్లే సమయం, డబ్బు వృధా అవదు.

పర్యావరణంపై ప్రభావం

స్కూల్ బస్సులు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు వంటి వాణిజ్య వాహనాలు పెద్ద సంఖ్యలో రోడ్లపై తిరుగుతున్నాయి. వీటిపై అవసరమైన భద్రతా తనిఖీలు జరగాలంటే స్థానికంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అధికారులు అందుబాటులో ఉండటం ముఖ్యం. కార్యాలయం లేకపోవటంతో నామమాత్రంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. వాహనాల నుంచి వచ్చే ఉద్గారాలను నియంత్రించేందుకు (పొల్యూషన్ అండర్ కంట్రోల్) టెస్టింగ్ కీలకం. ఇక్కడ కార్యాలయం లేకపోవడంతో ఈ సేవలు పరిమితంగానే ఉన్నాయి. దీని ప్రభావం పర్యావరణంపై పడే ప్రమాదం ఉంది.

పెరిగిన వాహనాల సంఖ్య

రేపల్లె డివిజన్‌లో కోవిడ్ అనంతరం వాహనాల సంఖ్య ఒక్కసారిగా మూడింతలు పెరిగింది. ద్విచక్ర వాహనాల సంఖ్య అధిక సంఖ్యలో పెరిగితే ఇక ఉపాధికై ఆటోలు, కార్లు సైతం పెరిగాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మోటారు వెహికల్ కార్యాలయంను డివిజన్ కేంద్రమైన రేపల్లెలో ఏర్పాటు చేయాలని వాహన చోదకులు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థులు



రావి శ్రావ్య



జితేంద్ర కుమార్

చుండూరు(వేమూరు): ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రావి శ్రావ్య (581) నూజివీడు, సీహెచ్ జితేంద్ర కుమార్(570) ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం జరిగిందన్నారు. విద్యార్థులను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

25 ఎకరాల వరిగడ్డి వామి దగ్ధం



కర్లపాలెం: వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన బుధవారం మండల పరిధిలోని గణపవరం గ్రామంలో చోటు చేసుకుంది. గణపవరం వీఆర్వో ఎ.శివారెడ్డి తెలిపిన వివరాల మేరకు గ్రామస్తుడు కర్రి శ్రీనివాసరావుకు చెందిన సుమారు 25 ఎకరాల వరిగడ్డి వామిలో దట్టమైన పొగలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

కౌలు రైతులకు నూరుశాతం గుర్తింపు కార్డులు అందజేయాలి

తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె: కౌలు రైతులకు నూరు శాతం గుర్తింపు కార్డులు అందజేసేలా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంగా పనిచేయాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కౌలు గుర్తింపు కార్డుల జారీపై రెవెన్యూ, వ్యవసాయ సహాయలకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు గుర్తింపు కార్డు కలిగిన రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కౌలు గుర్తింపు కార్డు పొందటంతో పొలం యజమానికి ఎటువంటి నష్టం వాటిల్లదన్న అంశంపై భూ యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో 6,550 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాల్సి ఉండగా నేటి వరకు 777 మంది నుంచి మాత్రమే దరఖాస్తులు అందాయన్నారు. ప్రతి కౌలు రైతు కౌలు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకునేలా పని చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు పొందేందుకు గుర్తింపు కార్డు ఉండాలని లేకపోతే పథకాలు వర్తించవని చెప్పారు. సమావేశంలో ఏవో అవ్వారు మహేష్, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

గ్రామస్తులు ఐకమత్యంగా ఉండాలి

ఎస్‌ఐ శివకుమార్‌యాదవ్



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): గ్రామస్తులందరూ ఐకమత్యంగా ఉండాలని చందోలు ఎస్‌ఐ ఎంవీ శివకుమార్ యాదవ్ చెప్పారు. బుధవారం పిట్టలవానిపాలెం మండల పరిధిలోని పుచ్చకుర్తివారిపాలెంను ఎస్‌ఐ శివకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ అందరూ తమ పిల్లలను చక్కగా చదివించుకోవాలని, మైనర్ బాలురకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. ద్విచక్ర వాహనాల మీద ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. గ్రామాలలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు.

జగనన్న కాలనీలో సమస్యలను పరిష్కరించండి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె: జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలపై పాలక ప్రభుత్వాలు, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించటం తగదని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ హెచ్చరించారు. పట్టణంలోని 18వ వార్డు జగనన్న కాలనీలో సీపీఎం బృందం బుధవారం పర్యటించి కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంది. కాలనీలో సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. నెల రోజులుగా కాలనీలో కనీసం బజారు విద్యుత్ లైట్‌లు వెలగకపోవటంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని, రాత్రి సమయంలో పాముల బెడదతో భయభ్రాంతులకు గురవుతున్నారని, తాగునీటి సమస్య తాండవిస్తోందని చెప్పారు. కాలనీ అభివృద్ధికై రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపామని చెబుతున్నా, ఆ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నట్లు తెలుస్తోందన్నారు. పాలకులు, అధికారుల్లో చిత్తశుద్ధి ఉంటే వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమస్యల సాధనకై మున్సిపల్ కార్యాలయం ఎదుట ఈ నెల 30వ తేదీన నిర్వహించే నిరసన కార్యక్రమంలో కాలనీవాసులు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి.ధనమ్మ, కమిటీ సభ్యులు దుర్గాదేవి, శ్రీనివాసరావు, కె.వీరాంజనేయులు, సుధాదేవి, షేక్ గౌసే తదితరులు పాల్గొన్నారు.



జగనన్న కాలనీవాసులతో మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

సాగులో విత్తన శుద్ధి కీలకం

రేపల్లె: సాగులో విత్తన శుద్ధి ప్రధాన ఘట్టమని మండల వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్‌బాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరవపల్లి, నల్లూరు గ్రామాలలో రైతులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విత్తన శుద్ధి సక్రమంగా చేయని ఎడల దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. మేలైన వరి వంగడాలను ఎంపిక చేసుకుని వ్యవసాయ అధికారుల సూచనల మేరకు విత్తన శుద్ధి చేయాలన్నారు. తద్వారా సాగులో చీడపీడలు ఆశించవన్నారు. విత్తన శుద్ధి చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలని, సాగులో రైతులకు కలిగే సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విత్తన శుద్ధి చేసే విధానాన్ని రైతులకు ప్రయోగపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

అమర్తలూరు(వేమూరు): కౌలు రైతులందరు కౌలు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్ కుమార్ అన్నారు. అమర్తలూరు మండలంలోని యడవూరు, కూచిపూడి గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వెద సాగులో ప్రధానంగా వరి విత్తనం ఎంపిక, విత్తన మోతాదు, విత్తన శుద్ధి ట్రాక్టర్ ద్వారా విత్తేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. దుక్కిలో ఎకరానికి డీఏపీ 50 నుంచి 70 కేజీలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 40 కిలోల చొప్పున వాడాలన్నారు. కూచిపూడి అసిస్టెంట్ సర్జన్ శివ పార్వతి మాట్లాడుతూ రైతులకు 75 శాతం సబ్సిడీపై మేత జొన్న విత్తనాలు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం క్లస్టర్ ఇన్‌చార్జి సువర్ణరావు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బి.మణికంఠ, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రవల్లిక, తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులకై దరఖాస్తు చేసుకోవాలి

నిజాంపట్నం: కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయ అధికారి చుక్కా విజయరాజు కోరారు. మండలంలోని కూచినపూడి, బొర్రావారిపాలెం గ్రామాలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొలం కౌలుకు సాగు చేసే కౌలు రైతులు, సొంత భూమి కలిగిన రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కౌలు గుర్తింపు కార్డులు పొందవచ్చన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గొరికపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

భట్టిప్రోలు(వేమూరు): ప్రభుత్వం సాగు నీరు సకాలంలో విడుదలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి బ్రహ్మారెడ్డి చెప్పారు. భట్టిప్రోలు మండలంలోని గొరికపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సాగు నీరు ముందుగా విడుదల చేయడం జరుగుతుందని రైతులందరు వ్యవసాయ సాగుకు సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. వరి నాట్లు వేసేందుకు సమయం ఉన్నందున రైతులు పచ్చిరొట్ట పంటల సాగు చేపట్టాలని ఆయన కోరారు. కౌలు రైతులందరు గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మీ ప్రసన్న, గ్రామ వ్యవసాయ సహాయకులు టి.అఖిల, జి.జ్యోతి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు విత్తన శుద్ధి ప్రక్రియను ప్రయోగ పూర్వకంగా వివరిస్తున్న ఏవో మహేష్‌బాబు

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

వేమూరు: రైతులందరు క్రాప్ ఇన్సూరెన్స్ కట్టుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.ప్రేమ్‌సాగర్ అన్నారు. వేమూరు మండలంలోని పెనుమర్రు, కోడేపర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రాప్ ఇన్సూరెన్స్ ఎకరానికి రూ.800 చెల్లించాలని తెలిపారు. ఆగష్టు 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని ఆయన చెప్పారు. రైతులు గ్రామ సచివాలయం లేదా పోస్టాఫీస్‌లో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.



కూచిపూడిలో మాట్లాడుతున్న ఏవో భరత్ కుమార్



కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏవో విజయరాజు



గొరికపూడిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో బ్రహ్మారెడ్డి



పెనుమర్రులో మాట్లాడుతున్న ఏవో ప్రేమ్‌సాగర్

ఒప్పంద ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

రేపల్లె: గురుకుల కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న 715 మంది ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014–19 కాలంలో ఏర్పాటు చేసిన గురుకులాల్లో 130 అతిథి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అవసరమైన చోట అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్‌ను ఏర్పాటు చేయటంతో పాటు విద్యార్థులు అధికంగా ఉన్న గురుకులాల్లో ఇద్దరు పీఈటీలను నియమించాలన్నారు. ఇటీవల గురుకులాల్లోని సమస్యలను పరిష్కరించాలని సంఘం తరపున ప్రభుత్వాన్ని కోరగా సానుకూలంగా స్పందించిందన్నారు. గురుకులాల్లోని ఇంటర్ విద్యార్థులకు నీట్, ఐఐటీ శిక్షణనిచ్చేందుకు రాష్ట్రంలో రెండు చోట్ల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ సెంటరులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు టీజీటీ స్కేల్ వర్తింపజేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. దీంతో పాటు వసతి గృహాల సంరక్షణకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక కో ఆర్డినేటర్‌ను నియమించాలని కోరారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు వెంకట నారాయణ, నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

గర్భిణులు, బాలింతల ఆధార్ నమోదు తప్పనిసరి

ఐసీడీఎస్ ఒంగోలు రీజియన్ ప్రాంతీయ ఉపసంచాలకులు జయలక్ష్మి

రేపల్లె: అంగన్‌వాడీ కేంద్రాలలోని లబ్ధిదారుల ఆధార్ ఐడీలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఐసీడీఎస్ ఒంగోలు రీజియన్ ప్రాంతీయ ఉప సంచాలకులు ఎస్.జయలక్ష్మి చెప్పారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంను బుధవారం ఆమె సందర్శించి సెక్టారు పరిధిలోని సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జులై 1 నుంచి లబ్ధిదారుల ముఖాధారిత హాజరు ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు. కేంద్రాలలోని బాలింతలు, గర్భిణులతో పాటు చిన్నారుల ఆధార్ ఐడీ కార్డులు సైతం నమోదు చేయాలన్నారు. నిర్దేశించిన సమయాలలో టీచర్‌లు, ఆయాలు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఐసీడీఎస్‌కు సంబంధించి అన్ని ఫోన్ యాప్‌లలో ఎప్పటికప్పుడు వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ప్రీస్కూల్ కార్యక్రమాలలో అంగన్‌వాడీ, ఆయాలు సైతం భాగస్వాములు కావాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించటంతో పాటు వారి ఆరోగ్య వివరాలు, కేంద్రాలలోని చిన్న పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.సుచిత్ర, సూపర్‌వైజర్‌లు సీహెచ్ హిమబిందు, రాధిక, విజయలక్ష్మి, మంజుల, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఒంగోలు రీజియన్ ప్రాంతీయ ఉపసంచాలకులు జయలక్ష్మి

విత్తన శుద్ధితో తెగుళ్ల నుంచి రక్షణ

కొల్లూరు : ఖరీఫ్ సాగు ఆరంభమవుతున్నందున రైతులు నారు మళ్లు పెంచుకోవడానికి అవసరమైన విత్తనాలను ముందుగా శుద్ధి చేసుకుంటే పంటకు నేల, విత్తనం ద్వారా లభించే తెగుళ్ల నుంచి రక్షణ లభిస్తుందని ఏవో వి.నరేంద్రబాబు అన్నారు. మండలంలోని చినపులివర్రులో బుధవారం ఆయన వ్యవసాయ శాఖ సిబ్బందితో కలసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిలో వరి విత్తనాలకు కార్బండిజమ్ 3 గ్రాముల చొప్పున కలుపుకొని 24 గంటల అనంతరం నారుమడిలో చల్లుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన నారుకు నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడుసార్లు దమ్ము చేసి చదును చేయాలని, నీరు పెట్టుకోవడానికి, బయటకు మళ్లించడానికి కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, 1 కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎరువులను దుక్కులో వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ అనుమానాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. కౌలు రైతులకు ఏవో కౌలు గుర్తింపు కార్డులను అందజేశారు. గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులు జేఎల్‌జీ గ్రూపులుగా ఏర్పడి బ్యాంక్‌లో రుణాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఎం.ప్రభాకరరావు, బీఎస్ వంశీ, వీహెచ్ఏ కె.విజయకుమార్, వీఆర్‌ఓ ఎన్.రాంబాబు పాల్గొన్నారు.



కౌలు రైతు గుర్తింపు కార్డులు అందిస్తున్న ఏవో నరేంద్రబాబు, సిబ్బంది

మేలు రకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

కర్లపాలెం: వేరుశనగ సాగుకు రైతులు మేలురకం విత్తనాలను ఎంపిక చేసుకోవాలని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీ నాయక్ చెప్పారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దుండివారిపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు వేరుశనగ పైర్లను పరిశీలించారు. మురళీనాయక్ మాట్లాడుతూ వేరుశనగ మొక్కలు 30 నుంచి 40 రోజుల మధ్యలో పూతదశలో ఉన్నప్పుడు ఊడలు దిగకముందు ఎకరాకు 200 కేజీల జిప్సం నేలలో వేసుకోవాలని చెప్పారు. సాగుకు ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని తెలిపారు. మొలక శాతం పరీక్షించుకున్న తరువాత విత్తుకోవాలన్నారు. ఏడీఏ ఎ.లక్ష్మి మాట్లాడుతూ కౌలు రైతులు సాగు ధ్రువీకరణ పత్రాలు పొందాలని చెప్పారు. రైతులందరూ ఆగష్టు 15 లోపు రైతు సేవా కేంద్రాలలో లేదా కామన్ సర్వీస్ సెంటర్‌లలో ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించుకోవాలన్నారు. ఖరీఫ్ వరి సాగు చేసే రైతులు బీపీటీ 2782, 2846, ఎంటీయూ 1318, 1262, 1232 వంటి రకాలను ఎంచుకోవాలని తెలిపారు. ఈ రకాలు తెగుళ్లను తట్టుకుని ధృడంగా ఉంటాయని ఆమె వివరించారు. కార్యక్రమంలో ఏవో సుమంత్‌కుమార్, వ్యవసాయ సహాయకురాలు మన్నెం సునీత, విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



వేరుశనగ పైరును పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీనాయక్

ప్రతిభావంతులను గుర్తించాలి

అమర్తలూరు: విద్యలో ప్రతిభావంతులను గుర్తించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హెచ్‌ఎం నిరీక్షణరావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ నుంచి యాజలి సృజని (577) ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినందుకు సృజని కుటుంబ సభ్యులను బుధవారం సన్మానించారు.